క్లుప్తంగా

వేదిక్‌లో దంత వైద్యశిబిరం

తిరుపతి సిటీ : ఎస్వీ వేదిక్ వర్సిటీలో మన్యా డెంటల్ క్లినిక్ వారు మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వీసీ రాణిసదాశివమూర్తి ఆదేశాల మేరకు చేపట్టిన క్యాంపులో 250మంది విద్యార్థులు, అధ్యాపకులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశబూరు. రిజిస్ట్రార్ భాస్కరుడు, డీన్ ప్రొఫెసర్ గోలి సుబ్రమణ్యం, పీఆర్‌ఓ డాక్టర్ టి.బ్రహ్మాచారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రాయితీ పరికరాలు



చిన్న రెడ్డెయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సతీష్

తిరుపతి అర్బన్ : జిల్లాలో అర్హులైన రైతులందరికీ రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందిస్తామని మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి చిన్న రెడ్డెయ్య తెలిపారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సతీష్ బదిలీపై వైఎస్సార్ జిల్లాకు వెళుతున్న నేపథ్యంలో ఆయనకు బాధ్యతలు అప్పగించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

భవిత కేంద్రంలో మెడికల్ క్యాంపు



వైద్యశిబిరం నిర్వహిస్తున్న అధికారులు

చంద్రగిరి : ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. 105 మంది దివ్యాంగ పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. ఏపీసీ గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పిల్లలకు ఉపకరణాలు అందిస్తామని వెల్లడించారు. ఇన్‌చార్జి చంద్రశేఖర్ రెడ్డి, ఏఎల్ఎస్‌ఓ చంద్రశేఖర్ నాయుడు, సీఎంఓ సురేష్, ఏఎస్‌ఓ సుధాకర్ నాయుడు, ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు, హెచ్ఎం వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. ఎమ్మార్‌పల్లెకు చెందిన మునిరాజాకు రూ.5.16 లక్షలు, రాజీవ్‌నగర్ కు చెందిన సుధాకర్ కు రూ.2.2లక్షలు, భవానీ నగర్‌కు చెందిన భాగ్యమ్మకు రూ.30.2 వేలు, రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన రమేష్ కు రూ.40.2 వేలు, శివజ్యోతి నగర్‌కు చెందిన జోతీశ్వర్ రెడ్డికి రూ.43.8 వేలకు చెక్కులను పంపిణీ చేశారు. జనసేన నగర అధ్యక్షుడు రాజా రెడ్డి, నేతలు కొండా రాజ్ మోహన్, ముని ప్రకాష్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై సదస్సు



అతిథిని సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : కరకంబాడిరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, అనువర్తనాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మంగళవారం చేపట్టిన సదస్సుకు సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సివిల్ ఇంజినీరింగ్ రంగంలో ఎలాంటి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందో వివరించారు. కళాశాల చైర్మన్ రామిరెడ్డి, డైరెక్టర్ అరవింద్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వాసు, డాక్టర్ బాలకృష్ణ భారత్ పాల్గొన్నారు,

రోగుల భద్రతకే ప్రాధాన్యం



రోగులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా : రోగుల భద్రతకే ప్రాధాన్యమిస్తామని స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజ్ తెలిపారు. మంగళవారం స్విమ్స్ ఆస్పత్రిలో ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవం నిర్వహించారు. వైద్యులు లలిత్, రామ్, కోటిరెడ్డి, సృజన పాల్గొన్నారు.

రౌడీ షీటర్ అజీమ్ అరెస్ట్

తిరుపతి క్రైమ్ : నగరంలోని లక్ష్మీపురానికి చెందిన రౌడీషీటర్ అజీమ్‌ను మంగళవారం అలిపిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 12వ తేదీన ఇద్దరు మహిళలను కిడ్నాప్ చేసిన కేసులో అజీమ్ నిందితుడు. సీఐ రామకిషోర్ నేతృత్వంలో బాధిత మహిళలను కాపాడారు. అప్పటి నుంచి అజీమ్ కోసం గాలింపు చర్యలు చేపట్టగా లక్ష్మీపురంలోని తన జిమ్ వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 5 కేజీల గంజాయి, స్టెరాయిడ్స్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సెంట్రల్ బస్టాండ్‌కు నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలోనే బంధుమిత్రులను బస్సు ఎక్కించేందుకు నగర వాసులు వస్తుంటారు. ఇదే సమయంలో వాహనాలను పార్క్ చేసుకునేందుకు నానా అవస్థలు పడుతుంటారు. అయితే బస్టాండ్‌లో దుకాణాలు నిర్వహించుకునే వ్యాపారులు మాత్రం తమ కార్లు.. ద్విచక్రవాహనాలను నిలుపుకునేందుకు ఆర్‌టీసీకి చెందిన ఓ స్థలం ఎంపిక చేసుకున్నారు. చుట్టూ కంచె వేసుకుని తమ ఆధీనంలో పెట్టుకున్నారు. తెలిసో తెలియకో బయటి వారు అందులో వాహనాలను నిలబెడితే నానా యాగీ చేసేవారు. దీనిపై సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ప్రజా రవాణాకు చెందిన ప్రాంతంలో కంచెను తొలగించారు.



ఆర్‌టీసీ బస్టాండ్ ఎదుట వ్యాపారుల ఆధీనంలోని స్థలం(ఫైల్)



ప్రశాంతంగా వాహనాలు పార్క్ చేసుకున్న నగరవాసులు

కంచె..తొలగించె!

- ఆర్‌టీసీ స్థలంపై వ్యాపారుల పెత్తనానికి చెక్
- స్వాధీనం చేసుకున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేసిన వాహనదారులు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో నుంచి ఎట్టకేలకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బస్టాండ్‌లోని ఖాళీ స్థలాన్ని కొందరు వ్యాపారులు ఆక్రమించడంతో తలెత్తిన పార్కింగ్ కష్టాలకు చెక్ పెట్టారు. ఈ మేరకు ప్రయాణికులకు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ఈ నెల 12న 'బస్టాండ్‌లో పార్కింగ్ కష్టాలు' అనే శీర్షికతో, 13వ తేదీన 'ఆర్‌టీసీ స్థలం..వ్యాపారుల ఆధీనం' అనే శీర్షికతో రెండు కథనాలు సాక్షిలో ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఆర్టీసీ డీపీటీఓ జగదీష్ స్పందించారు. రెండు రోజుల్లో వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథానికి ఆదేశాలు జారీ చేశారు.

కథనాలు వాస్తవమే

డీసీటీ విశ్వనాథం చేపట్టిన విచారణలో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాలు వాస్తవమేనని వెల్లడైంది. ఆయన స్థానికులతోపాటు పలువురు వాహనదారులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కంచెను పరిశీలించారు. అనంతరం ఈ నెల 15వ తేదీన నివేదికను సమర్పించారు.

కేసులు తప్పవు

సెంట్రల్ బస్టాండ్ ముందు భాగంలో వ్యాపారులు ఏర్పాటు చేసిన కంచెను డీపీటీఓ జగదీష్ సోమవారం పరిశీలించారు. వెంటనే కంచెను తొలగించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో ఎవరైనా వాహనదారులు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీంతో కంచె తొలగింపునకు అధికారులు రంగంలోకి దిగారు. మంగళవారం మధ్యాహ్నానికి కంచెను పూర్తిగా తొలగించారు. మరోసారి ఇదే విధంగా ఈ స్థలంలో కంచె పెడితే కేసులు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు.

హమ్మయ్య.. బండి పెట్టుకున్నాం

బస్టాండ్ ముందు స్థలం ఖాళీగా ఉన్నప్పటికీ వ్యాపారులు మినహా మిగిలిన వారు తమ వాహనాలను నిలబెట్టుకోలేని పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు కంచెను తొలగించడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు తమ స్కూటర్లు, బైక్‌లను ఆ స్థలంలో ప్రశాంతంగా పార్క్ చేసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి పత్రికకు పలువురు కృతజ్ఞతలు తెలియజేయడం విశేషం.



బస్టాండ్ ముందు అడ్డు తొలగడంతో స్కూటర్లు పార్క్ చేసిన వాహనదారులు

నోటీస్ బోర్డు

- మహతి కళాక్షేత్రంలో ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు సామూహిక ధ్యానం, ఆధ్యాత్మిక గురువుల సందేశాలు.
- కరకంబాడి రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్స్ కాలనీ వద్ద ఉదయం 8.45 గంటలకు పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం.
- గాలివీధిలోని అంకాళమ్మ ఆలయంలో ఉదయం 11 గంటలకు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం.
- స్విమ్స్‌లో ఉదయం 9.30 గంటలకు శ్రీపద్మావతి ఓపీడీ బ్లాక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రోగుల సహాయకుల వసతి గృహం ప్రారంభం.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 6.30 గంటలకు రామచంద్ర పుష్కరిణి వద్ద ఊంజల్ సేవ.
- కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు టీబీ రోగులకు ఉచితంగా కిట్లు పంపిణీ.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు 'సింధూరం' అనే అంశంపై చర్చా వేదిక.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరాలు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు పీహెచ్‌సీ పరిధిలో బుధవారం నుంచి 29 తేదీ వరకు స్వస్థ్ సశక్తి అభియాన్ కింద ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ తేజేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీతోపాటు నారాయణాద్రి హాస్పిటల్ నేతృత్వంలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 17న కుప్పం బాదూరు, 18న మిట్టకండ్రిగ, 19ననెత్తకుప్పం, 20న అనుప్పల్లె, 26న బాలినాయుడుకండ్రిగ, 27న అప్పలాయిగుంట, 29వ తేదీన సి.కాలేపల్లి ఆరోగ్య ఉప కేంద్రాల్లో శిబిరాలు ఉంటాయని వివరించారు.

బాధ్యతగా ఓజోన్ పరిరక్షణ



పద్మావతి కళాశాలలో..



పాకాల : ఓజోన్ పొర నమూనా ఏర్పాటు చేసిన విద్యార్థులు



కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో..

తిరుపతి సిటీ : ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ప్రిన్సిపల్ నారాయణమ్మ కోరారు. మంగళవారం నగరంలోని పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఓజోన్ పొర పరిక్షణ దినోత్సవంనిర్వహించారు. డాక్టర్ జ్యోతి, జ్ఞాన ప్రసూన, డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

పాకాల : ఓజోన్ పొరను కాపాడుకునేందుకు మొక్కలు నాటాలని ప్రిన్సిపల్ ఎస్వీ రమేష్‌కుమార్ తెలిపారు. పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ మాసిలామణి, కన్వీనర్ మోహన్ బెహారా, అధ్యాపకులు చిట్టకళావతి, ఆదిశేఖర్‌రెడ్డి, రేఖ, ఈశ్వర్‌బాబు, రమణమ్మ, పావని పాల్గొన్నారు.

మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో...

గ్రామంలో విద్యార్థులు గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. హెచ్ఎం సుమలత, గ్రీన్ మాస్టర్ వనపర్తి వెంకట సిద్ధులు, ఉపాధ్యాయులు ఆదికేశవులు, విమాలా విక్టోరియా, సుల్తాన్, నీరజ, రామమూర్తి పాల్గొన్నారు.

అవగాహన అవసరం

తిరుపతి అర్బన్: ఓజోన్ పొర ప్రయోజనాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పర్యావరణశాఖ ఇంజినీర్ రాజశేఖర్ తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. బీవీకే గ్రూప్ ప్రతినిధులు, చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ డైరెక్టర్ అలేఖ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, పొల్యూషన్ బోర్డు ఏఈఈలు మదన్‌మోహన్‌రెడ్డి, శశికళ పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై 20న సంతకాల సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

తిరుపతి అర్బన్ : బీజేపీ ఓట్ల చోరీపై ఈ నెల 20వ తేదీన సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు చిట్టిబాబు తెలిపారు. మంగళవారం కరకంబాడి మార్గంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పార్టీ నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ సాగిస్తున్న పోరాటానికి అందరూ అండగా నిలవాలని కోరారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నేతలు బాలగురవం బాబు, రాంభూపాల్ రెడ్డి, వెంకట నరసింహులు, మురళీకృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

'బొజ్జా' సేవలు మరువలేం



నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : దళిత, ఆదివాసీ, పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పౌరహక్కుల ఉద్యమ నేత, న్యాయ కోవిదుడు బొజ్జా తారకం సేవలు మరువలేమని వక్తలు కొనియాడారు. బొజ్జాతారకం వర్ధంతిని మంగళవారం యూత్ హాస్టల్లో నిర్వహించారు. రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప, జిల్లా జడ్జి ఆనంద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి, సాంఘిక సంక్షేమ శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ టి.విజయ్‌కుమార్, సీపీఐ జిల్లా నేత చిన్నం పెంచలయ్య, ఆర్‌పీఐ ఇండియా దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, హైకోర్టు న్యాయవాది సంపూర్ణమ్మ హాజరయ్యారు బొజ్జా తారకం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పుష్పరాజ్, డాక్టర్ ప్రసాద్‌రావు, ఏ.సుబ్రమణ్యం, గుర్రప్ప, నాగేంద్ర, రాజేష్‌బాబు, హరిబాబు, దేశమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ సివిల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఇంజినీర్ల దినోత్సవంనిర్వహించారు. టీఏపీటీ అధ్యక్షుడు ప్రసాద రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకానాథ రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సుజాత, ప్రోగ్రామింగ్ అధికారి పి.రాజ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు.

హామీలు నెరవేర్చాలని వినతి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నేతలు

తిరుపతి అర్బన్ : ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి నేతలు నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కే యాదవ్ కోరారు. మంగళవారం ఈ మేరకు డీఆర్‌ఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న ఆ ఊసేలేదని మండిపడ్డారు. అలాగే బీసీల కులగణన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నేతలు లోకనాథం గౌడ్, వాసు కుమార్ గౌడ్, తిరుమలేష్, పద్మప్రియ, భాస్కర్, గోపాల్, చిరంజీవి, శేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారి భక్తుల సేవే లక్ష్యం



ఈఓకు జ్ఞాపిక అందిస్తున్న టీటీడీ చైర్మన్

తిరుమల : శ్రీవారి భక్తుల సేవే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తానని టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, పాలకమండలి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా అంకురార్పణ



పుట్టమట్టి తీసుకువస్తున్న చెవిరెడ్డి కుటుంబీకులు, పండితులు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగే పవిత్రోత్సవాలకు మంగళవారం రాత్రి వైభవంగా అంకురార్పణ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి రఘునాథరెడ్డి కుటుంబీకులు హాజరయ్యారు. ముందుగా వినాయకుని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి తీసుకువచ్చిన పుట్టమట్టితో ఆలయం వద్ద యాగశాలలో వైదిక క్రతువులు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ ఆగమోక్తంగా అంకురార్పణ జరిపించారు. అనంతరం దేవదేవేరులను ఊరేగించారు. కల్యాణ వెంకన్న వేద పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మాజీ శర్మ మాట్లాడుతూ ఆలయంలో తెలిసీ తెలియక జరిగిన తప్పిదాలకు పరిహారంగా ఏటా పవిత్రోత్సవాలను మూడు రోజులపాటు నిర్వహిస్తుంటారని వెల్లడించారు.

భూ కబ్జాలపై సమష్టి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

తిరుపతి కల్చరల్ : నగరంలో భూ కబ్జాలు పెరిగిపోతున్నాయని, సమష్టిగా పోరాటం చేసి అడ్డుకుంటామని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. అధికార పార్టీ, పోలీసుల అండతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని పేదల స్థలాలను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం ఎస్ఎల్‌వీ నగర్‌లో సంపూర్ణమ్మ అనే బాధితురాలి స్థలం వద్ద అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పి.మురళి, వందవాసి నాగరాజు మాట్లాడుతూ వడమాలపేటకు చెందిన సంపూర్ణమ్మ 40 ఏళ్ల క్రితం ఎస్ఎల్‌వీ నగర్‌లో స్థలం కొనుగోలు చేసిందన్నారు. అయితే 2005లో ఎక్కడో కొనుగోలు చేసిన స్థల పత్రాలను అడ్డుపెట్టుకుని కొందరు కబ్జాకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. సంపూర్ణమ్మ స్థలం కాపాడాలని, గత ఏడాది అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అడ్డుకున్నామని తెలిపారు. మళ్లీ ప్రస్తుత అధికార పార్టీ అండతో కబ్జాదారుల పాగా వేస్తున్నారని మండిపడ్డారు. వివిధ పార్టీల నేతలు వేణుగోపాల్‌రాజు, జనార్ధన్, గుట్టా నాగరాజు, కీర్తన, నీరజ, సంపూర్ణమ్మ, చంద్రశేఖర్‌రావు, సాంబశివరెడ్డి, శంకర్ రాజు, నిరంజన్ నాయుడు, రెడ్డెప్ప నాయుడు, శాంతమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలా?



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : నగరంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. మంగళవారం ఉదయం కాలేజీలోకి విద్యార్థులు, అధ్యాపకులు వెళ్లలేని దుస్థితి తలెత్తింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నేతలు ఉదయ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు వెంటనే కళాశాల వద్దకు చేరుకున్నారు. నీటిలోనే విద్యార్థులతో కలిసి నిలబడి నిరసన తెలిపారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రతిష్ఠాత్మక ఎస్‌జీఎస్ కళాశాలకు ఈ పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలలో ఆటలాడుతున్నారని, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మురుగు నీరు కాలేజీలోకి వస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే విద్యార్థులు విష జ్వరాలతో బాధపడుతున్నారని వాపోయారు. రులు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అతలాకుతలం

వరుణుడి ప్రకోపానికి తిరునగరం అతలాకుతలమైంది. సోమవారం అర్ధరాత్రి కుండపోత వర్షానికి జల దిగ్బంధంలో చిక్కుకుంది. సుమారు రెండు గంటల పాటు బీభత్సంగా కురిసిన వానలో పలు కాలనీలు నీటమునిగాయి. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద ప్రమాదకర స్థాయిలో చెత్తాచెదారాలు పేరుకున్నాయి. పలు ప్రాంతాల్లో ఇళ్ల బయట నిలబెట్టిన ద్విచక్రవాహనాలు, కార్లు దెబ్బతిన్నాయి. పెద్దసంఖ్యలో వీధులు బురదమయంగా మారిపోయాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పారిశుద్ధ్య సిబ్బంది రంగంలోకి దిగారు. రోడ్లపై చేరిన వ్యర్థాలను తొలగించారు. వీధులను శుభ్రం చేశారు.

- తిరుపతి తుడా/ తిరుపతి మంగళం



డీఆర్ మహల్ సమీపంలోని ఆర్‌ఓబీ వద్ద..



కేబీఆర్ నగర్‌లో వాహనదారుల ఇక్కట్లు



ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో..

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా విజయభాస్కరరావు



తిరుపతి సిటీ: ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఎస్వీయూ ప్రొఫెసర్ విజయభాస్కరరావు నియమితులయ్యారు. మంగళవారం రాత్రి ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆరోగ్య భద్రత అవసరం

తిరుపతి తుడా: ఆరోగ్య భద్రత అందరికీ అవసరమని డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన స్వస్థ్ సశక్తి పరివార్ అభియాన్ పోస్టర్ ఆవిష్కరించారు. బుధవారం అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు చేపట్టాలని కోరారు. ఆయుష్మాన్ కార్డులు అందించాలని సూచించారు. ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాసరావ్ పాల్గొన్నారు.

ఎస్టీ మహిళపై దాడి

చంద్రగిరి : ఎస్టీ మహిళపై విచక్షరహితంగా దాడికి పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం కోదండరామాపురంలో చోటు చేసుకుంది. ప్రాణభయంతో మహిళా పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. కోదండ రామాపురానికి చెందిన చిన్నమ్మ, అదే గ్రామంలోని మాజీ ఎంపీపీ నివాసంలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ముంగిళిపట్టుకు చెందిన శోభ, నాలుగు నెలల ముందు కొంత బంగారం తీసుకొచ్చి వాటిని తనఖాపెట్టి డబ్బులు తీసివ్వాలని చిన్నమ్మను కోరింది. దీంతో చిన్నమ్మ ఆ నగలను తనఖాపెట్టి రూ.లక్ష అందించింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం శోభతో పాటు ఆమె తల్లి కోదండరామాపురంలోని చిన్నమ్మ నివాసానికి చేరుకున్నారు. బంగారు నగలు ఎప్పుడు విడిపించి ఇస్తావ్ అంటూ.. కులం పేరుతో దూషిస్తూ విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డారు. ఎస్టీ మహిళ అని చూడకుండా చెప్పులతో కొట్టుకుంటూ, బట్టలు చింపేశారని బాధితురాలు వాపోయారు. శోభ కోరితేనే నగలు కుదువపెట్టి డబ్బులు తీసిచ్చానని, ఇప్పుడు ఇలా దాడికి పాల్పడ్డారంటూ కన్నీటి పర్యంతమైంది. అనంతరం తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు చిన్నమ్మ తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.